క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన తప్పనిసరి

మాజీ జెడ్పీటీసీ నోముల కృష్ణాగౌడ్

తుర్కయంజాల్: ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు, రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు నోముల కృష్ణా గౌడ్ కోరారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఇనిస్టిట్యూటర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. అంతకుముందు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌ను ఎన్నికలు నిర్వహించి ఎన్నుకున్నారు. స్పోర్ట్స్, కల్చరల్, సైన్స్, లిటరసీ క్లబ్, ఆర్ట్ క్లబ్, మ్యాథ్స్, డిసిప్లేనరి కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

తలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే రుణమాఫీ చేస్తామని ప్రకటించడం, రైతులను మోసపుచ్చడమే అవుతుందని తన అసంపూర్తిని వ్యక్తం చేశారు.

మంచాల ఎస్ఐగా రజనీకర్



రజనీకర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మంచాల: మంచాల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రజనీకర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన రవి కుమార్ నాయక్ వనస్థలి పురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రజనీకర్ వచ్చారు. కొత్తగా వచ్చిన ఎస్ఐని మండల బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి పోలమోని భిక్షపతి యాదవ్ శాలువా కప్పి సన్మానం చేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లయ్య యాదవ్, యాదయ్య, ఐలయ్య, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు.

జంగయ్య గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

మంచాల: మంచాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ జన్మదిన కార్యక్రమం ఆరుట్లలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. మాదగోని జంగయ్యగౌడ్‌కు శాలువా కప్పి, పూల దండలు వేశారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్ నాయక్, లొంగారి యాదగిరి, మహేష్, అశ్వల బాలరాజ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం వేడుకలు



సంకటోనిపల్లి పీర్లచావిడిలో ప్రతిష్ఠించిన పీర్లు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఐదు రోజుల పాటు నిర్వహించే వేడుకల కోసం పీర్లచావిడిలో పీర్లను ప్రతిష్ఠించారు. పీర్లకు ఫాతేహాలు సమర్పించి ప్రజలు మొక్కులు తీర్చుకుంటున్నారు. పీర్లచావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద యువకులు ఉత్సాహంగా అలాయ్ ఆడారు. మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

యువజన అధ్యక్షపదవి బరిలో ఇమ్రాన్‌బాబా



నామినేషన్ దాఖలు చేసిన ఇమ్రాన్‌బాబా

కడ్తాల్: యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్ష పదవి బరిలో మండల కేంద్రానికి చెందిన ఇమ్రాన్ బాబా బరిలో నిలిచారు. మంగళవారం కల్వకుర్తి యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షపదవికి ఆయన ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పార్టీ బలోపేతం కోసం క్రమశిక్షణతో పనిచేస్తున్నానని ఆయన తెలిపారు. పార్టీకి మరింత సేవలందించేందుకు నియోజకవర్గ అధ్యక్షపదవికి పోటీలో నిలిచినట్లు, తనను ఆదరించాలని కోరారు.

అన్ని హంగులతో 'కేజీబీవీ'

నెరవేరనున్న విద్యార్థుల కల

- నేడు పాఠశాలను ప్రారంభించనున్న మంత్రులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ప్రారంభానికి ముస్తాబవుతున్న పాఠశాల భవనం

కడ్తాల్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అన్ని హంగులతో, సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేశారు. ఏడు ఏళ్లుగా అద్దెభవనంలో సౌకర్యాల లేమితో విద్యార్థులు అనేక ఇబ్బందుల మధ్య విద్య నభ్యసించారు. మండల కేంద్రంలో 2017–18లో అద్దెభవనంలో ప్రారంభమైన కేజీబీవీ పాఠశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో, ఇరుకు గదుల్లో కొనసాగుతూ వచ్చింది. విద్యార్థులు చదువులో మాత్రం ఏనాడు వెనుకబడలేదు. ప్రతీ సంవత్సరం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలతో రాణించారు. ప్రతీ సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధిస్తూ వచ్చారు. ప్రస్తుతం పాఠశాలలో 250కు పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 20 మంది వరకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో కొనసాగుతుంది. అద్దె భవనంలో నిర్వహిస్తున్న పాఠశాలలో సరైన ఫర్నీచర్ లేక పోవడంతో విద్యార్థుల చదువులు ఇక్కట్ల మధ్య కొనసాగించారు. ప్రత్యేకంగా భోజనాలు చేసేందుకు డార్మెంటరీ గది లేక పోవడంతో వరండాలోనే భోజనాలు చేసేవారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూమ్స్ లేక అనేక ఇక్కట్లకు గురయ్యేవారు. దీంతో పాటు సరైన ఆట స్థలం లేక పోవడంతో ఆటల్లో నైపుణ్యం కొరవడే పరిస్థితి ఉండేది.

తీరనున్న ఇక్కట్లు

విద్యార్థుల కష్టాలు తీరాలంటే అన్ని వసతులతో కూడిన సొంత భవనం ఉండాలని, ఏడేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతూ వచ్చారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకున్న గత ప్రభుత్వ పాలకులు, మండల కేంద్రం నుంచి కానుగుబావితండాకు వెళ్లే రహదారి పక్కన రెండెకరాల విస్తీర్ణంలో స్థలాన్ని ఎంపిక చేశారు. విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.3.35 కోట్ల వ్యయంతో 2020లో పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికి అనుకున్నంత వేగంగా జరుగలేదు. భవన నిర్మాణానికి సకాలంలో నిధులు మంజూరు కాలేదు. కోవిడ్, భవన నిర్మాణ కార్మికుల సమస్యతో పాటు, ఇతరత్రా వివిధ సమస్యల కారణంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నిర్మాణ పనులు పడుతూ..లేస్తూ నత్తనడకన కొనసాగింది. పలు మార్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు, అధికారులపై, ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడంతో, గుత్తేదారు పనులు చేపట్టారు. తిరిగి కొన్ని రోజులకే పనులు నిలిపి వేశారు. ఇలా భవన నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరుగలేదు. ఈ విషయమై ఏడాది క్రితం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో పాటు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో భవన నిర్మాణ పనులు చకచక సాగింది. ఎనిమిది, తొమ్మిది నెలలుగా పాఠశాల నిర్మాణ పనులు నిరివ్రామంగా సాగడంతో ఎట్టకేళకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో విద్యార్థుల ఏడేళ్ల కష్టాలకు పుల్‌స్టాప్ పడనుంది. నేడు పాఠశాలను రాష్ట్ర మంత్రులు ప్రారంభించనుండటంతో వారు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పాఠశాల సొంత భవనం కల నేరవేరనుంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాలను బుధవారం ఉదయం 10 గంటలకు, రాష్ట్ర మంత్రులచే ప్రారంభించనున్న నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో ఏర్పాట్లను రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటీవ్ ఈఈ కుమార్‌గౌడ్, ఎంపీడీవో సుజాత, డీఎఫ్ఓ ప్రభాకర్ రెడ్డి, ఎంఈఓ సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య, పాఠశాల ఎస్ఓ అనిత, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో సభ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, పాఠశాల తరగతి గదులను, పాఠశాలలో నీటీ వసతి, విద్యుత్ తదితర ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి, ఉమ్మడి పాలమూర్ జిల్లాకు చెందిన పలువురు శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు, నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'అక్షయపాత్ర'కు ఇవ్వొద్దు



కడ్తాల్: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కడ్తాల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకివ్వొద్దని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా కార్యదర్శి పెంటయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పెంటయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇస్తే 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, శారద, వెంకటమ్మ, అలివేలు, అమృతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు నల్ల రిబ్బన్‌తో కళ్లకు గంతలు కట్టుకొని సమ్మె నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రమాదేవి, హేమలత, మంజుల, బాలమణి, సావిత్రి, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందునాయక్, మల్లారి, చంద్రకళ, పద్మ, కళమ్మ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మంచాల మండల కార్యాలయం ముందు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సరిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జంగమ్మ, పద్మ, భారతమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



ట్యాంకు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీపటేల్‌గూడలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయిన వెంటనే మిషన్ భగీరథ నుంచి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరి, డీఈ వెంకన్న, ఏఈ వీరాంజనేయులు, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

నృత్య పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ఆర్థిక సాయం చేస్తున్న రేణురెడ్డి, తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన పూజ, నందిని, శ్రావ్యలు రాష్ట్ర స్థాయి సాంస్కృతిక నృత్య పోటీలకు ఎంపికైనట్లు జేఎస్ డ్యాన్స్ అకాడమీ నృత్య శిక్షకుడు శేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 20న యాదాద్రిలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కూచిపూడి శాస్త్రీయ నృత్య పోటీలో పాల్గొననున్నారని శేఖర్ చెప్పారు. ఈ సందర్భంగా గట్టుఇప్పలపల్లిలో విద్యార్థినులకు సన్మాన, సత్కార, అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు నాయకుడు రేణురెడ్డి విద్యార్థినులను అభినందించి నృత్య ప్రదర్శనల ఖర్చుల నిమిత్తం వారికి రూ.10వేల సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్, కిషన్, వాల్మీకి దేశముని, రాములు, నరేందర్, రాహుల్, పవన్ వాల్మీకి, శివ శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిపల్లిలో..

జంగారెడ్డిపల్లికి చెందిన కల్వకోలు భాస్కరయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలంగౌడ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, మోహన్‌రెడ్డి, మధు, మహేష్, మల్లేష్, పెంటయ్య, పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



ఆమనగల్లులో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని జిల్లా నాయకులు అప్పం శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతు రుణమాఫిపై రైతులు ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన వివరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరుతామన్నారు. ఈ సమావేశంలో గాజుల శ్రీను, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

ఎంపీడీఓ శ్రీకాంత్



భూమిని చదును చేయిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓలు

తలకొండపల్లి: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లని, చెట్లుంటే క్షేమం, లేకుంటే క్షామం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హర్యానాయక్ తండా, వెంకటాపూర్ తండాల శివారు ప్రాంతంలోని 10 ఎకరాల అటవీ భూముల్లో మొక్కలు నాటడానికి ఎంపీడీఓ ఆధ్వర్యంలో జేసీబీతో భూమి చదును చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ భూమిలో సుమారు 32వేల మొక్కలు నాటాలన్నారు. మండల వ్యాప్తంగా 1,92,000 వేల మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు 40వేల మొక్కలు నాటినట్లు గుర్తు చేశారు.

నేడు వ్యవసాయ పంపుసెట్ల పంపిణీ

కడ్తాల్: అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జమ్ములాబావి తండాలోని చెంచు కుటుంబాలకు బుధవారం ఉదయం వ్యవసాయ పంపుసెంట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై, చెంచులకు వ్యవసాయ పంపు సెట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు యువజన కాంగ్రెస్ నేతల సమావేశం

ఇబ్రహీంపట్నం: యువజన కాంగ్రెస్ నేతలతో ఇబ్రహీంపట్నంలో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. యువజన కాంగ్రెస్‌కు జరుగనున్న సంస్థాగత ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజవకర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు, గ్రామాల యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శుభాకాంక్షలు

షాద్‌నగర్: తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపేదలకు అండగా లయన్స్‌క్లబ్



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ లయన్స్‌క్లబ్‌లు నిరుపేదలకు అండగా నిలిచాయని ఆమనగల్లు నూతన అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి ప్రజలందరికీ అందేలా చూస్తామని ఆయన చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగాం పసుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నాయని చెప్పారు. నేత్రదానంపై ప్రజలు అపోహలు వీడి మరణానంతరం నేత్రాలను దానం చేయాలని ఆయన సూచించారు. వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్‌లు బండెల రామచంద్రారెడ్డి, జూలురి రమేష్, సభ్యులు దోనాదుల మహేష్, ఎంగలి బాలకృష్ణ, పాపిశెట్టి రాము, కొండల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహ, పీఆర్ఓ పాషా, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని రెండో రోజూ రిలే నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందని విమర్శించారు. కార్మికులకు జీతాలతోపాటు మెస్ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులను ఇప్పటి వరకు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేష్, బుగ్గరాములు, శిరీష, మార్తామ్మ, బీమమ్మా, మంజుల, పుష్ప, ప్రేమలత, పద్మ, కళమ్మ, కళావతి, సుజాత, లక్ష్మీ, పార్వతమ్మలు పాల్గొన్నారు.

అమ్మమాట అంగన్‌వాడీ బాట



అంగన్ వాడీ బడిబాటలో అధికారులు తదితరులు



కడ్తాల్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కడ్తాల్: మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శబరి, టీచర్లు భాగ్య, జ్ఞానేశ్వరి, యాదమ్మ, మంగమ్మ, సిబ్బంది లక్ష్మిబాయి, అలివేలు, శాంతమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మంచాల: మంచాల మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 'అమ్మ మాట– అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీగా తిరిగారు. మూడు సంవత్సరాల లోపు పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అవగాహన కల్పించారు. పిల్లలకు అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు వారి భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నారని టీచర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్ వైజర్ కల్పన, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



కడ్తాల్: వినతిపత్రం అందజేసిన ముదిరాజ్ సంఘం నాయకులు



తలకొండపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్

కడ్తాల్: రూ.1000 కోట్లతో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభ పిలుపు మేరకు ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు హక్కుల సాధనకై సంఘటితంగా పోరడాలని పిలుపునిచ్చారు. బీసీ–డి నుంచి బీసీ–ఎ లో చేర్చాలని, జీవో నెంబర్ 15ను వెంటనే అమలు చేయాలని కోరారు. చెరువులు, కుంటలపై బెస్తాలకు, ముదిరాజ్‌లకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, ఎర్రోళ్ల రాఘవేందర్, యాదయ్య, శ్రీను, లక్ష్మయ్య, సత్యానారయణ, రంగయ్య, రమేశ్, బాలయ్య, జంగయ్య, బుచ్చయ్య, మైసయ్య, అశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పింఛన్‌లు ఇవ్వాలి

తలకొండపల్లి: ముదిరాజ్‌లను బీసీ డి నుంచి ఏ లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోల యాదగిరి డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు ఆసరా పింఛన్‌లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మంగళవారం వివిధ గ్రామాల మత్స్యకారుల సొసైటీల అధ్యక్షులతో కలిసి యాదయ్య తహసీల్దార్ రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య ఉద్యోగ, ఉపాధి తదితర రంగాల్లో ముదిరాజ్ మత్స్యకారులు వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1000 కోట్లతో ప్రత్యేక ప్యాకేజిని ప్రకటించి తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణయ్య, తిరుపతయ్య, యాదగిరి, యాదయ్య, శేఖర్, రమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, శివానంద్, నరేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.